## 23. మీరెవరు?

శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికల దర్శనానికి వెళ్ళిన ఓ భక్తుడు ఓ సత్రంలో బస చేసాడు. ఆ రాత్రి అతను గదిలో పడుకుంటే బయట నించి తలుపు తట్టిన చప్పుడుకి అతనికి మెలకువ వచ్చింది.

"లోపల ఎవరు?" అన్న మాటలు వినిపించాయి.

"నేను." జవాబు చెప్పాడు అతను.

"నేనంటే?" ఆ కంఠం మళ్ళీ వినపడింది.

అది క్షత్రియ అన్నదాన సత్రం కాబట్టి బస చేసిన వాళ్ళని తణిఖీ చేస్తున్నారన్న అపోహతో అతను జవాబు చెప్పాడు.

"నేను క్షత్రియుడ్ని."

"నువ్వెవరో నాకు తెలీలేదు."

"నేను భీమవరం నించి వచ్చాను." జవాబు చెప్పాడు అతను.

"నువ్వెవరో సరిగ్గా అర్ధమయ్యేలా చెప్పు."

"నేను డాక్టర్ని."

"అబ్బా! నువ్వెవరయ్యా?" విసుగ్గా అడిగిందా కంఠం.

"రామరాజుని."

"ఇంతకీ నువ్వెవరో చెప్పవే? ఓ సారి క్షత్రియుడివి అంటావు. ఇంకోసారి భీమవరం నించి వచ్చానంటావు. మరోసారి డాక్టర్ని అంటావు. రామరాజుని అంటావు. ఇంకేదో అంటావు. ఇలా మాట మార్చకుండా అసలు నువ్వెవరో చెప్పలేవా?"

"చెప్పలేను."

"ఐతే నే చెప్పనా?" అడిగిందా కంఠం.

"చెప్పండి."

అతనెవరో చూద్దామని వెంటనే రామరాజు లేచి తలుపు తీసి బయటకి వెళ్ళాడు. మూడో అంతస్థులోని ఆ పొడవాటి కారిడార్‌లో అతనికి ఎవరూ

కనపడలేదు. ఆ ప్రశ్నకి జవాబు తెలీలేదు. తను అవేం కాకపోతే మరి ఎవరా అని ఆతను ఆలోచిస్తూ పడుకున్నాడు.

అతనెవరో మీకు తెలుసా? పోనీ మీరెవరో మీకు తెలుసా? జవాబుకి చిన్న క్లూ. అతనెవరో మీరూ అదే. మీరెవరో అతనూ అదే.

## 24. మంత్ర దీక్ష

నేను రాసిన ఈ తాత్విక కథని ఓ ఆధ్యాత్మిక పత్రికకి పంపితే దాన్ని వాళ్ళు ప్రచురించారు. తత్వవిదానంద స్వామి వారి దగ్గరకి వెళ్ళినప్పుడు ఆ కథని తీసుకెళ్ళి ఇచ్చాను. దాన్ని వారు అప్పటికప్పుడే చదివి ఫకాలున నవ్వుతూ నా వంక చూసారు. వెంటనే అడిగాను.

"కథలో తప్పులేమైనా వున్నాయా స్వామీ?"

"అసలు కథలోని ఇతివృత్తమే తప్పు."

ఆయన్ని వివరించమని కోరితే నాకు ఆ విషయాన్ని ఇలా చెప్పారాయన.

"నీ కథలో ఓ ధనవంతుడు ఒక సన్యాసి దగ్గరకి వెళ్ళి తనకి శివ పంచాక్షరీ మంత్ర దీక్షని ఇవ్వమని కోరుతాడు. 'ఇప్పుడు కాదు. కొంతకాలం అయాక రా.' అని చెప్పి పంపించేస్తాడా సన్యాసి. ఆ తర్వాత మంత్రదీక్ష ఇవ్వమని ఎన్ని సార్లు అడిగినా అతనికి దీక్ష ఇవ్వడు ఆ సన్యాసి. 'మరి కొంతకాలం ఆగి రా' అని ఆ ధనవంతుడ్ని పంపించేస్తూంటాడు. దాంతో కోపం వచ్చిన ఆ సంపన్నుడు, 'నాకు దీక్ష ఇవ్వడం మీకు ఇష్టం లేకపోతే చెప్పండి. ఎందుకు నన్ను మీ చుట్టూ ఇలా పదే పదే తిప్పించుకుంటారు?' అని గట్టిగా అడుగుతాడు.' ఇంతదాకా కరెక్టేగా?" అడిగాడు తత్వవిదానంద స్వామి.

"కరెక్టే స్వామి. మర్నాడు వుదయం సన్యాసి అతనింటికి భిక్షకి వస్తానంటాడు. ఆ ధనవంతుడు రుచికరమైన భోజనం చేయిస్తాడు. మధ్యాహ్నం ఒంటిగంటకి ఆ సన్యాసి తన చేతిలో భిక్షాపాత్రతో వస్తాడు. తను వండించినవన్నీ అందులో వేయబోయి భిక్షా పాత్రలో మట్టి, ఇసక వుండటం చూసి ఆగపోతాడు. అందులో వెయ్యమని ఆ సన్యాసి చెప్తే, 'ఎలా వెయ్యను స్వామి? నేను వడ్డించేదంతా